నమస్తే తెలంగాణ
యాదాద్రి భువనగిరి
11 | హైదరాబాద్, సోమవారం 12 ఫిబ్రవరి 2024 | YADADRI BHUVANAGIRI

## జిల్లాలో 14 మంది ఎంపీడీఓల బదిలీలు

భువనగిరి కలెక్టరేట్, ఫిబ్రవరి 11 : పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో జిల్లాలో పలు మండల పరిషత్ అధికారులను ఇతర జిల్లాలకు బదిలీ చేస్తున్నట్లు ఆదివారం ఉత్తర్వులు వెలువడ్డాయి. ఈక్రమంలో జిల్లాలో పనిచేస్తున్న 14మంది ఎంపీడీఓలకు వివిధ జిల్లాలకు బదిలీ చేశారు. బదిలీ అయిన ఎంపీడీఓలలో పి.జ్ఞానప్రకాశ్‌రావును నల్లగొండకు, ఇ.వీరస్వామిని మహబూబ్‌నగర్‌కు, ఎల్.చంద్రమౌళిని నల్లగొండకు, లెంకల గీతారెడ్డిని మేడ్చల్ మల్కాజ్‌గిరికి, కె.ప్రభాకర్‌రెడ్డిని వికారాబాద్‌కు, ఎ. రాములును జనగామకు, యు. శ్రీవాణిని రంగారెడ్డికి, ఎ.బాలశంకర్‌ను రంగారెడ్డికి, బి, సరితను రంగారెడ్డికి, జి, జలంధర్‌రెడ్డిని జనగామకు, ఎం.ఉమాదేవిని జనగామకు, బి.యాదగిరిని సిద్దిపేటకు, జి, శ్రీనివాసులును జనగామకు, గుత్తా నరేందర్‌రెడ్డిని రంగారెడ్డికి బదిలీ చేశారు.



నిత్య కల్యాణం నిర్వహిస్తున్న అర్చకులు

# వైద్య సేవలకు డ్రోన్ టెక్నాలజీ

**బీబీనగర్ ఎయిమ్స్ డ్రోన్ ప్రాజెక్ట్ సక్సెస్**

ఒకప్పుడు మారుమూల పల్లెల్లో ఆరోగ్య సేవలు ఉండేవి కాదు. వైద్య సేవలు, రోగ నిర్ధారణ పరీక్షలు చేయించుకోవాలంటే వందల కిలోమీటర్ల దూరంలో ఉన్న జిల్లా కేంద్రానికి రావాల్సిన పరిస్థితి. పెద్ద మొత్తంలో దుబారా ఖర్చులు, సమయం వృథా అయ్యేది. కానీ రానురాను మెడికల్ టెక్నాలజీ అందుబాటులోకి వస్తున్నది. ఇప్పుడు కొండలు, తండాల ముంగిటకు సైతం వైద్య సేవలు దరిచేరుతున్నాయి. జిల్లాలోని బీబీనగర్ ఎయిమ్స్ డ్రోన్ ప్రాజెక్ట్‌లో భాగంగా డ్రోన్ ద్వారా నమూనాలు, మందుల రవాణా ట్రయల్ రన్ విజయవంతంగా ముగియడంతో రెగ్యులర్ కార్యకలాపాలు సైతం సమర్థంగా అందిస్తూ అందరి మన్ననలు పొందుతున్నది. నిమిషాల్లో పరీక్షలు ఫలితాలు, మందుల రవాణా జరుగుతున్నది.

– యాదాద్రి భువనగిరి, ఫిబ్రవరి 11 (నమస్తే తెలంగాణ)/బీబీనగర్

- దేశంలోని నాలుగు ప్రాజెక్ట్‌ల్లో మనది ఒకటి
- ట్రయల్ రన్ విజయవంతం.. రెగ్యులర్ కార్యకలాపాలు షురూ
- 25కిలోమీటర్ల పైకి ఎగిరేలా డ్రోన్ సామర్థ్యం
- కొండ ప్రాంతాలు, గిరిజన ఆవాసాల్లో నమూనాల సేకరణ
- నిమిషాల్లో రోగ నిర్ధారణ ఫలితాలు.. తిరిగి మందుల చేరవేత
- జిల్లాలోని పలు పీహెచ్‌సీలు, సబ్ సెంటర్లకు అనుసంధానం
- ఇప్పటి వరకు 150 నమూనాలు, మందుల రవాణా పూర్తి
- త్వరలో మరిన్ని ఆస్పత్రులకు విస్తరించే యోచన



డ్రోన్ ద్వారా మెడిసిన్స్, డయాగ్నోస్టిక్స్ శాంపిల్స్ రవాణాకు సిద్ధం చేస్తున్న సిబ్బంది

### దేశంలో నాలుగు ప్రాంతాల్లో అధ్యయనం..

దేశంలోని వివిధ ప్రాంతాల్లో ఐసీఎంఆర్ (ఇండియన్ కౌన్సిల్ ఆఫ్ మెడికల్ రీసెర్చ్) టాస్క్‌ఫోర్స్ డ్రోన్ ప్రాజెక్ట్‌పై అధ్యయనం చేస్తున్నది. ఇందులో భాగంగా యాదాద్రి భువనగిరి జిల్లాలో ఎయిమ్స్ బీబీనగర్ డ్రోన్ ప్రాజెక్ట్ నిర్వహిస్తున్నారు. మనతోపాటు దేశంలోని ఢిల్లీ, కర్నాటక, హిమాచల్ ప్రదేశ్‌లలో డ్రోన్ రవాణాపై అధ్యయం చేస్తున్నారు. ఒక్కో ప్రాంతాల్లో ఒక్క అంశంపై స్టడీ నడుస్తున్నది. మన జిల్లాలో గిరిజన ప్రాంతాలు, కొండల ప్రాంతాల్లో డ్రోన్ రవాణా ద్వారా కఫం నమూనాలు, ఇతర మందుల చేరవేత సాధ్యాసాధ్యాలపై అధ్యయనం చేస్తున్నారు. హిమాచల్‌ప్రదేశ్‌లో మందుల రవాణా, ఢిల్లీలో బ్లడ్ బ్యాగ్‌లు, కర్నాటకలో ఆంకాలజీ–హిస్టోపాథాలజీ నమూనాల తరలింపులపై అధ్యయనాలు జరుగుతున్నాయి.

### ట్రయల్ రన్ విజయవంతం..

ఇండియన్ కౌన్సిల్ ఆఫ్ మెడికల్ రీసెర్చ్ జిల్లాలో జాతీయ టీబీ నిర్మూలన కార్యక్రమం కింద కఫం నమూనాలు, ఇతర మందుల రవాణాలో డ్రోన్ వినియోగంలో సాధ్యాసాధ్యాల అధ్యయనంపై బీబీనగర్ ఎయిమ్స్‌కు డ్రోన్ ప్రాజెక్ట్‌ను మంజూరు చేసింది. దీంతో ఎయిమ్స్ బృందం ఆధ్వర్యంలో గతేడాది 2023 డిసెంబర్ 14 నుంచి డ్రోన్ పరీక్షలు నిర్వహిస్తున్నారు. ఇందుకోసం కలెక్టర్, డీఎంహెచ్‌ఓ, డీజీపీ, సివిల్ ఏవియేషన్ మంత్రిత్వ శాఖ అనుమతులు తీసుకున్నారు. మొదటగా వివిధ ప్రాంతాలకు ట్రయల్ రన్ నిర్వహించారు. ఆ తర్వాత ఈ ఏడాది జనవరి 3వ తేదీ నుంచి కఫం నమూనాల రవాణా రెగ్యులర్‌గా కొనసాగుతున్నది. జిల్లాలోని ముగ్గురు ఆశా వర్కర్లకు ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ అగ్రికల్చర్ యూనివర్సిటీలో మారుతీ డ్రోన్ ట్రైన్ అకాడమీ ఆధ్వర్యంలో డ్రోన్లపై శిక్షణ ఇప్పించారు. వీరు పీహెచ్‌సీలు, సబ్ సెంటర్లస్థాయిలో డ్రోన్ ఆపరేట్ చేయడంతో సహాయం చేస్తున్నారు. ఇక మన జిల్లాలో డ్రోన్ సుమారు 20 కిలోమీటర్ల దూరం వరకు ఎగిరే సామర్థ్యం ఉంది. నోయిడా ప్రాంతంలో 60కిలోమీటర్ల వరకు కూడా ఎగురుతుందని, త్వరలోనే ఇక్కడ కూడా ప్రవేశ పెట్టే అవకాశాలు ఉన్నాయని తెలుస్తున్నది.

### జిల్లాలో మరింత విస్తరణ..

జిల్లాలో ప్రస్తుతం పలు పీహెచ్‌సీలు, సబ్ సెంటర్లకు డ్రోన్ సేవలు అందుతున్నాయి. జిల్లాలోని బొల్లెపల్లి, కొండమడుగు, బొమ్మలరామారం పీహెచ్‌సీలు, పీబీ తండా మర్యాల, నందనం సబ్‌సెంటలను భువనగిరి ట్యూబర్క్యులోసిస్ యూనిట్‌కు, వర్కట్‌పల్లి, మునిపంపుల పీహెచ్‌సీలను రామన్నపేట ట్యూబర్క్యులోసిస్ యూనిట్‌కు డ్రోన్ ద్వారా అనుసంధానం చేశారు. జిల్లాలోని సబ్ సెంటర్ల స్థాయికి డ్రోన్ ఆపరేషన్లు విస్తరించాలని యోచిస్తున్నారు. విక్షిత్ భారత్, టీబీముక్త్ భారత్‌లో భాగంగా రానున్న రోజుల్లో డ్రోన్ ప్రాజెక్ట్‌ను మరింత విస్తరించనున్నారు. డ్రోన్ టెక్నాలజీ సహాయంతో జిల్లాలోని మరిన్ని మూరుమూల గ్రామాల్లోకి డ్రోన్ సేవలు అందించాలని భావిస్తున్నారు.

### ప్రశంసల వెల్లువ..

డ్రోన్ ద్వారా నమూనాలు, మందులు రవాణా చేయడంపై వివిధ వర్గాల నుంచి ప్రశంసల వెల్లువ కొనసాగుతున్నది. బీబీనగర్ ఎయిమ్స్ బృందాన్ని కొనియాడుతున్నారు. ఇలాంటి ప్రాజెక్టులు మరిన్ని రావాలని ఆకాక్షించారు. జనవరి 20న ఎయిమ్స్‌కు వచ్చిన సందర్భంగా కేంద్ర మంత్రి ఆర్‌కే సింగ్ డ్రోన్ ప్రాజెక్ట్‌ను ప్రశంసించారు. డ్రోన్‌పై శిక్షణ పొందిన డ్రోన్ పైలెట్లకు సర్టిఫికెట్లు అందించారు.

### టీబీ కఫం నమూనాలు.. మెడిసిన్స్ రవాణా..

జిల్లాలోని మారుమూల ప్రాంతాల పీహెచ్‌సీల నుంచి టీబీ అనుమానిత కఫం నమూనాలను జిల్లా ట్యుబర్‌కోలసిస్ యూనిట్లకు డ్రోన్ ద్వారా రవాణా చేస్తున్నారు. అంతే కాకుండా డ్రోన్ ద్వారా ట్యుబర్క్యులోసిస్ యూనిట్ల నుంచి పీహెచ్‌సీలకు టీబీ మెడిసిన్స్, ఫాల్కన్ ట్యూబ్లు రవాణా చేస్తున్నారు. ఫిబ్రవరి 9వ తేదీ వరకు జిల్లాలో 150 కఫం నమూనాలను డ్రోన్ ద్వారా సేకరించారు. దీని ద్వారా మారుమూల పల్లెల్లో ఉండే పేద రోగులకు అనవసర ఖర్చులు, తండాలు, దూర ప్రాంతాల్లో ఉండేవారికి సమయం ఆదాయం అవుతున్నది. అంతేకాకుండా రోగ నిర్ధారణలో జాప్యం కాకుండా ఉపయోగపడుతుంది.

## యాదగిరి గుట్టలో భక్తజన సందడి

యాదగిరిగుట్ట, ఫిబ్రవరి11 : పంచనారసింహుడి క్షేత్రంలో భక్తుల సందడి నెలకొన్నది. ఆదివారం సెలవుదినం కావడంతో స్వయంభూ నారసింహుడి దర్శించుకునేందుకు పెద్దసంఖ్యలో తరలివచ్చారు. మాడవీధులు, క్యూ కాంప్లెక్స్, గర్భాలయ ముఖ మండపంలోని క్యూలైన్లు కిక్కిరిసిపోయాయి. తెల్లవారుజాము నుంచే స్వయంభూ నారసింహుడిని దర్శించుకున్న భక్తులు మొక్కులు చెల్లించుకున్నారు. నిత్యతిరు కల్యాణోత్సవం, సువర్ణపుష్పార్చనలో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. స్వామి, అమ్మవార్ల నిత్యతిరు కల్యాణోత్సవం శాస్త్రోక్తంగా సాగింది. ఉదయం స్వామివారికి సుదర్శన నారసింహహోమం జరిపిన అర్చకులు కల్యాణమూర్తులకు గజవాహన సేవలను నిర్వహించారు. సుమారు గంటన్నర పాటు సాగిన వేడుకల్లో భక్తులు పాల్గొని కల్యాణోత్సవాన్ని తిలకించారు. సాయంత్రం స్వామి, అమ్మవార్లకు తిరువీధి సేవోత్సవం, దర్బార్ సేవలో భక్తులు పాల్గొని తరించారు. పాతగుట్ట ఆలయంలో ఆర్జిత పూజలు వైభవంగా నిర్వహించారు. స్వామివారి ధర్మదర్శానికి 2 గంటలు, వీఐపీ దర్శనానికి గంట సమయం పట్టిందని భక్తులు తెలిపారు. స్వామివారిని సుమారు 40 వేల మంది భక్తులు దర్శించుకున్నట్లు ఆలయ అధికారులు వెల్లడించారు. అన్ని విభాగాలను కలుపుకొని స్వామివారి ఖజానాకు రూ. 53,48,668 ఆదాయం సమకూరిందని ఆలయ ఈఓ రామకృష్ణారావు తెలిపారు.



కొండపైన బస్‌స్టాండ్‌లో భక్తుల రద్దీ

## కేఆర్ఎంబీకి ప్రాజెక్టులను అప్పగించడం కాంగ్రెస్ చేతగానితనమే..

- బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు కంచర్ల రామకృష్ణారెడ్డి



మోత్కూరులో చలో నల్లగొండ బహిరంగ సభ పోస్టర్‌ను అవిష్కరిస్తున్న బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు కంచర్ల రామకృష్ణారెడ్డి, నాయకులు

మోత్కూరు, ఫిబ్రవరి 11 : కాంగ్రెస్ ప్రభుత్వ రెండు నెలల పాలనను ప్రజలు గమనిస్తున్నారని, కృష్ణా ప్రాజెక్టుల నిర్వహణను కేఆర్ఎంబీకి అప్పగించడం ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి చేతగాని తనమేనని బీఆర్ఎస్ యాదాద్రి భువనగిరి జిల్లా అధ్యక్షుడు కంచర్ల రామకృష్ణారెడ్డి అన్నారు. 13న నల్లగొండలో జరగనున్న చలో నల్లగొండ పోస్టర్‌ను ఆదివారం మోత్కూరులో బీఆర్ఎస్ నాయకులతో కలిసి అవిష్కరించారు. ఈ సందర్భంగా విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పాటైనప్పటి నుంచి కృష్ణా ప్రాజెక్టులను కేఆర్ఎంబీకి అప్పగించాలని ఒత్తిడి తెలిచ్చినా మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ తలొగ్గలేదన్నారు. ఎన్నికల్లో ప్రజలకు మాయ మాటలు చెప్పి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ రెండు నెలల పాలన గడువక ముందే కేఆర్ఎంబీకీ కృష్ణా ప్రాజెక్టులను అప్పగించడం విచారకరమని తెలిపారు. దీని వల్ల 14 జిల్లాలకు చెందిన రైతులు, ప్రజలకు సాగు, తాగు నీటికి తీవ్ర అన్యాయం జరుగుతుందని చెప్పారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ విధానాలకు వ్యతిరేకంగా ప్రజలను చైతన్యం చేయడం కోసం నల్లగొండలో భారీ బహిరంగ సభను బీఆర్ఎస్ నిర్వహిస్తున్నదని, ప్రజలు, రైతులు పెద్ద సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని కోరారు.

ప్రజా సంక్షేమ పథకాల అమలుపై చిత్త శుద్ధి లేని కాంగ్రెస్ ప్రభుత్వం బడ్జెట్‌పై అంచనాలను రూపొందించడంలో విఫలమైందన్నారు. ఎన్నికల్లో చేసిన ఆరు గ్యారెంటీల అమలుపై విఫలమైన కాంగ్రెస్, ఎంపీ ఎన్నికల్లో 17 స్థానాల గెలిస్తే ఆరు గ్యారెంటీలను అమలు చేస్తామని ప్రకటించుకోవడం సిగ్గు చేటని చెప్పారు. కాంగ్రెస్ మోసాలకు ప్రజలు తగిన బుద్ధి చెబుతారని అన్నారు. సమావేశంలో బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు పొన్నెబోయిన రమేశ్, మున్సిపాలిటీ అధ్యక్షుడు బొడ్డుపల్లి కళ్యాణ్ చక్రవర్తి, ఎఫ్ఎస్‌సీఎస్ చైర్మన్ కంచర్ల అశోక్‌రెడ్డి, బీఆర్ఎస్ రాష్ట్ర నాయకులు ధర్మేరందర్‌రెడ్డి, వ్యవసాయ మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ కొణతం యాకుబ్‌రెడ్డి, మాజీ ఎంపీటీసీ జంగ శ్రీను, మహిళావిభాగం మండల అధ్యక్షురాలు మల్లం అనిత, నాయకులు మర్రి అనిల్‌కుమార్, కొండ సోంమల్లు, దబ్బెటి శైలజ, గజ్జి మల్లేశ్, దాసరి తిరుమలేశ్ పాల్గొన్నారు.

## ఉన్నత లక్ష్యంతో దేనినైనా సాధించవచ్చు

**పద్మశ్రీ అవార్డు దక్కడం సోమ్లాల్ నాయక్ ఘనత**

**కలెక్టర్ హనుమంత్ కె.జెండగే**



పద్మశ్రీ కెతావత్ సోమ్లాల్‌నాయక్‌ను సన్మానిస్తున్న కలెక్టర్ హనుమంతు కె. జెండగే, డీసీపీ రాజేశ్‌చంద్ర, గిరిజన నాయకులు

భువనగిరి కలెక్టరేట్, ఫిబ్రవరి 11 : భగవద్గీతను బంజారా భాషలోకి అనువాదం చేసిన పద్మశ్రీ అవార్డు గ్రహీత కెతావత్ సోమ్లాల్‌నాయక్ ఘనత ఎంతో గొప్పదని, పట్టుదల, ఉన్నత లక్ష్యంతో ఏదైనా సాధించవచ్చని జిల్లా కలెక్టర్ హనుమంత్ కె. జెండగే కొనియాడారు. ఆదివారం మండలంలోని ఆకుతోటబావితండా గ్రామ యువకుల అధ్వర్యంలో నిర్వహించిన సోమ్లాల్‌నాయక్ సన్మాన, అభినందన కార్యక్రమంలో కలెక్టర్ పాల్గొని మాట్లాడారు. గిరిజన గ్రామ పంచాయతీలో పుట్టి 700 శ్లోకాలు రాసి భగవద్గీతను బంజారా భాషలోకి అనువాదం చేసి టీటీడీకి బహూకరించిన సోమ్లాల్‌కి పద్మశ్రీ అవార్డు రావడం సంతోషకరమని చెప్పారు. సోమ్లాల్ యుక్త వయస్సులో ఉన్నప్పటి నుంచి బంజారా భాషలో శ్లోకాలు, పాటలు రాసేవారని, తన కున్న సంకల్పంతో నేడు పద్మశ్రీ అవార్డు దక్కడం గొప్ప విశేషమని, అలాంటి బాటలో యువత నడువాలని సూచించారు. డిప్యూటీ కమిషనర్ ఆఫ్ పోలీస్ రాజేశ్‌చంద్ర సోంమ్లాల్‌నాయక్ పద్మశ్రీ అవార్డు సాధించడం యావత్ తెలంగాణ రాష్ట్రానికే గర్వకారణమన్నారు. పద్మశ్రీ అవార్డు గ్రహీత సోమ్లాల్‌నాయక్ మాట్లాడుతూ తన కుటుంబం వ్యవసాయం చేసుకుంటూ ఊరికి దూరంగా నివసించే వారమన్నారు. గిరిజన భాషలో భగవద్గీత రాయడంతో ప్రభుత్వం గుర్తించి పద్మశ్రీ పురస్కారాన్ని ఇవ్వడం ఆనందంగా ఉందని తెలిపారు. కార్యక్రముంలో కళాశ్రీ మెగావత్ భిక్షునాయక్, గిరిజన పరిరక్షణ సమితి రాష్ట్ర అధ్యక్షుడు దేవసోత్ త్రివిక్రంరాథోడ్, రావి నారాయణరెడ్డి సేవా సంస్థ అధ్యక్షుడు చెరుకుపల్లి శ్రీనివాస్, ఉపాధ్యక్షులు పడాల భాస్కర్‌రావు, యువజన సంఘం అధ్యక్షుడు కెతావత్ తిరుపతినాయక్, తేజావత్ కుమార్, తేజావత్ కృష్ణ, తేజావత్ ప్రవీణ్, కె. రాజ్ కుమార్, కెతావత్ ప్రవీణ్, శ్రీనివాస్, సంజీవ, శ్రీను, మహేశ్, కృష్ణ, నితిన్, కుమార్, రాజు, ఉమ్లా, పాండు, ప్రతాప్‌సింగ్ పాల్గొన్నారు.

## కేసీఆర్ అంటే త్రీ ఫేజ్ కరెంట్.. ముట్టుకుంటే మసైపోతారు



తిరుమలగిరిలో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యేలు జీవన్‌రెడ్డి, కిశోర్‌కుమార్

- కేసీఆర్ సభను అడ్డుకునే దమ్ము ఎవరికీ లేదు
- చేసిన ద్రోహం కప్పిపుచ్చుకునేందుకు కాంగ్రెస్ అసత్య ప్రచారం
- తెలంగాణ హక్కుల కోసం పోరాడేది బీఆర్ఎస్ మాత్రమే
- తిరుమలగిరి ప్రెస్ మీట్‌లో మాజీ ఎమ్మెల్యేలు జీవన్‌రెడ్డి, కిశోర్‌కుమార్

తిరుమలగిరి, ఫిబ్రవరి 11 : 'ఈ నెల 13న నల్లగొండలో కేసీఆర్ సభను అడ్డుకుంటామని జోకర్స్, బ్రోకర్స్ కోమటిరెడ్డి బ్రదర్స్ అనడం సిగ్గుచేటు. నల్లగొండ కేసీఆర్ అడ్డా, కేసీఆర్ అంటే త్రీ ఫేజ్ కరెంట్.. ముట్టుకుంటే మసైపోతారు. కోమటిరెడ్డి బ్రదర్స్ బెదిరింపులు కొత్తకాదు. కాంగ్రెస్ పార్టీ మొత్తం కదిలి వచ్చినా కేసీఆర్ సభను అడ్డుకోలేరు' అని ఆర్మూర్ మాజీ ఎమ్మెల్యే జీవన్‌రెడ్డి అన్నారు. తిరుమలగిరి మండల కేంద్రంలో మాజీ ఎమ్మెల్యే గాదరి కిశోర్‌కుమార్‌తో కలిసి ఆదివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. తెలంగాణ రాష్ట్రాన్ని కొట్లాడి తెచ్చుకున్నది ప్రధానంగా నీళ్ల కోసమని, కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి రాగానే కృష్ణానీటిలో మన వాటా తేల్చకుండా ప్రాజెక్టులను కేఆర్ఎంబీకి అప్పగించడం రైతాంగాన్ని, ప్రజలను మోసం చేయటమేనన్నారు. కాంగ్రెస్ నాయకులు తాము చేసిన ద్రోహాన్ని కప్పి పుచ్చేందుకు అసత్య ఆరోపణలు చేస్తున్నారని మండిపడ్డారు. కేసీఆర్ సభను అడ్డుకునే దమ్ము ఎవ్వరికి లేదని అన్నారు. జైళ్లు, అరెస్టులు బీఆర్ఎస్‌కు కొత్త కాదని, బెదిరెంపులకు భయపడమని స్పష్టం చేశారు. రైతుల కోసం, తెలంగాణ ప్రజల ప్రయోజనాల కోసం పేగులు తేగేవరకూ పోరాడుతామని చెప్పారు. తక్షణమే ప్రభుత్వం కేఆర్ఎంబీ ఒప్పందాన్ని విరమించక పోతే ప్రజలే తగిన బుద్ధి చెబుతారని హెచ్చరించారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చి తర్వాత రైతు బంధు రాంరాం పలికారని, రెవెన్యూ పూర్తిగా పడిపోయిందని, దళిత బంధు లేదని, రుణమాఫీ లేదని విమర్శించారు. కేసీఆర్ హయాంలో 24 గంటలు కరెంట్ ఇస్తే ప్రస్తుతం పగటి పూట 4 గంటల కరెంట్ కూడ సక్రమంగా రావడం లేదని అన్నారు. కాంగ్రెస్ నాయకులు ప్రతి పక్షంలో ఉన్నా, పాలక వర్గంలో ఉన్నా అవగాహన లేకుండా మాట్లాడుతున్నారని విమర్శించారు. ఇరిగేషన్ శాఖపై అవగాహన లేని మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి ఆ శాఖకు మంత్రా అని ఎద్దేవా చేశారు. ఈ నెల 13న నల్లగొండలో జరిగే కేసీఆర్ సభకు 9 మండలాల నుంచి ప్రజలు, బీఆర్ఎస్ శ్రేణులు పెద్ద సంఖ్యలో తరలిరావాలని పిలుపునిచ్చారు.

ఓటుకు నోటు దొంగ రాష్ట్ర ముఖ్యమంత్రి కావడం మన దురదృష్టం అని తుంగతుర్తి మాజీ ఎమ్మెల్యే గాదరి కిశోర్‌కుమార్ అన్నారు. ట్రిబునల్ వేసి నీటి పంపకాలు చేయకుండా 9 సంవత్సరాలు నిర్లక్ష్యం చేసింది మోదీ ప్రభుత్వం అని అన్నారు. కల్లుతాగిన కోతుల్లా కోమటిరెడ్డి బ్రదర్స్ పూటకో మాట మాట్లాడుతూ కేసీఆర్ సభను అడ్డుకుంటామని అనటం సిగ్గు చేటని మండిపడ్డారు. గతంలో రాష్ట్ర పతి పాలన పెడుతామన్న భయపడకుండా కేసీఆర్ కేఆర్ఎంబీకి ప్రాజెక్టులు అప్పగించలేదని తెలిపారు. తెలంగాణ ప్రజలకోసం ప్రాణాలైన అర్పించే వ్యక్తి కేసీఆర్ అని చెప్పారు. సమావేశంలో రైతు బంధు సమితి మాజీ జిల్లా కోఆర్డినేటర్ రజాక్, ఎంపీపీ స్నేహలత, మున్సిపల్ చైర్‌పర్సన్ రజినీ, పీఏసీఎస్ చైర్మన్ పాలేపు చంద్రశేఖర్, నాగారం బీఆర్ఎస్ మండల పార్టీ అధ్యక్షుడు ఉప్పలయ్య, బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



ప్రథమ బహుమతి పొందిన నల్లగొండ మహిళా జట్టుకు కప్ అందజేస్తున్న ఎమ్మెల్యే కుంభం అనిల్‌కుమార్‌రెడ్డి

## ఖోఖో రాష్ట్ర స్థాయి పోటీల్లో నల్లగొండ మహిళా జట్టు విజయం

భువనగిరి అర్బన్, ఫిబ్రవరి 11 : భువనగిరి పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల ఆవరణలో నిర్వహించిన రాష్ట్ర స్థాయి ఖోఖో పోటీలు ఆదివారం ముగిశాయి. మొదటి, రెండోరోజు 14 లీగ్ మ్యాచ్‌లు నిర్వహించగా, మూడో రోజు ఆదివారం సెమీ ఫైనల్, ఫైనల్ మ్యాచ్‌లు జరిగాయి. అనంతరం విజేతలకు భువనగిరి ఎమ్మెల్యే కుంభం అనిల్‌కుమార్‌రెడ్డి బహుమతులు అందజేశారు. ఫైనల్ పోటీల్లో పురుషుల విభాగంలో ప్రథమ స్థానంలో కరీంనగర్, ద్వితీయ రంగారెడ్డి, జాయింట్ విన్నర్స్‌లో వరంగల్, హైదరాబాద్ జట్లు నిలిచాయి. మహిళల విభాగంలో నల్లగొండ ప్రథమ, రంగారెడ్డి ద్వితీయ, మహబూబ్‌నగర్ జట్టు తృతీయ బహుమతులు గెలుచుకున్నాయి. చతుర్థి స్థానంలో హైదరాబాద్ జట్లు నిలిచాయి. ప్రతిభ కనబరిచిన క్రీడాకారులను ఖోఖో అసోసియేషన్ కమిటీ సభ్యులు అభినందించారు. కార్యక్రమంలో స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ జిల్లా అధ్యక్షుడు స్టాలిన్‌బాబు, ఉమ్మడి నల్లగొండ జిల్లా ఖోఖో అసోసియేషన్ కార్యదర్శి కృష్ణమూర్తి, సభ్యుడు రమేశ్ రెడ్డి పాల్గొన్నారు.